ఆగమాగం ఓటేస్తే రైతు బతుకు ఆగమే!

కాంగ్రెస్ కరెంటు షాక్ తప్పదు..

ఖానాపూర్, నవంబర్ 23 : తెలంగాణ వచ్చినసంది కరెంట్ మంచిగా ఉంటుంది. మాలాంటి రైతులు ఎప్పుడు అవసరముంటే అప్పుడు చేన్లకు పోయి చేసిన పంటకు నీళ్లు పెట్టుకుంటున్నారు. కాంగ్రెస్ వాళ్లు మూడు గంటల కరెంట్ ఇస్తే ఎట్ల సరిపోతుంది. నాలుగు ఓట్లు రానోడు సూత నోటికి వచ్చినట్లు మాట్లాడవట్టే. వారికి ఎన్నికల్లో రైతులు గట్టి షాక్ ఇస్తరు. రైతులందరూ ఒక్కసారే మోటర్లు చాలు చేస్తే ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోతయ్. లోవోల్టేజీతో మా మోటర్లు కాలితే పంటలు ఎండిపోతయ్. గతంలో కాంగ్రెస్ ఉన్నప్పుడు కరెంట్ ఎప్పుడు వస్తదో తెలువక రాత్రి పడిగాపులు కాయాల్సి వచ్చేది. పంట చేతుకు వచ్చాక మోటర్లు కాలి సరైన నీరందక పంట ఎండిపోయి అప్పుల పాలయ్యేది. మళ్లా అప్పటి చీకటి రోజులు యాదికస్తే అప్పుల బాధలు తప్పవని అనిపిస్తుంది. 10 హెచ్‌పీ మోటర్లు మా ఏరియాలో లేవు. రైతులు సంతోషంగా ఉండుడు కాంగ్రెసోళ్లకు ఇష్టం లేనట్టున్నది. బీఆర్‌ఎస్ సర్కారు నీళ్లు 24 గంటల కరెంట్‌కు ఇస్తుండడంతో రందిలేకుండా ఉంది. నేను ఖానాపూర్ మండలం తర్లపాడు గ్రామ శివారులోని నా సొంత నాలుగెకరాల భూమిలో వరి పంట పండిస్తున్నా. ఎలాంటి ఢోకా లేకుండా ఉంది.

- రామిడి నర్సయ్య, రైతు, తర్లపాడు

50 ఏళ్లలో ఏం చేసింన్రు అని..

కుంటాల, నవంబర్ 23 : తెలంగాణ రాష్ట్రం వచ్చిన తర్వాత కేసీఆర్ దయతో మా లాంటి రైతు కుటుంబాల్లో ఆనందం వెల్లివిరుస్తు న్నది. రైతుబంధు, రైతుభీమా, సమయానికి సబ్సిడీతో ఎరువులు ఇచ్చుకుంటూ మమ్మల్ని ఆదుకుంటున్నడు. ఇప్పుడు ఎన్నికలు రాగానే 50 ఒడ్లు పాలించిన కాంగ్రెస్ పార్టీ ఇప్పుడు వచ్చి చేస్తామంటే మేం నమ్మలేం. పంట సాగుకు మూడు గంటల కరెంటు ఇచ్చి, 10 హెచ్‌పీ మోటర్లు పెడతామం టున్నారు. ఈ పార్టీకి రైతులపై ఎప్పుడూ అసూయనే. రైతులు బాగుపడడం ఆ పార్టీకి నచ్చదు. 10 హెచ్‌పీ మోటర్లు పెడితే కరెంటుతో పాటు నీళ్లు కూడా ఎండిపోయి, మా బతుకులు ఇంకా ఆగమైతయ్. మా ఊరుకు ఆరేండ్ల కింద ప్యాకేజీ-27 కాలువు తవ్విన్రు. దాన్లో మేము మోటర్లు పెట్టుకొని పంటలు బాగా పండించుకుంటున్నం. ఆర్థికంగా బాగుపడుతున్నం. ఇప్పుడు మూడు గంటల కరెంటు ఇస్తే, మక్క కర్రలు, పత్తి కర్రలు ఎండిపోతయ్. మేము మళ్లా బీఆర్‌ఎస్‌కే ఒటేస్తాం.

- మ్యాతరి శ్రీనివాస్, అంబకంటి, కుంటాల

కాంగ్రెసోళ్లవి అవగాహన లేని మాటలు

నిర్మల్ చైన్‌గేట్, నవంబర్ 23 : నేను బోరు మోటర్లు వైండింగ్, రిపేర్ చేస్తుంటా. గత ప్రభుత్వం హయాంలో అనేక విద్యుత్ పంపుసెట్లు కాలిపోతుండేవి. లోవోల్టేజీ సమస్య వల్ల మోటర్లు కాలిపోతుండే. రైతులు వైండింగ్ షాపుల్లో రేయింబవళ్లు పడిగాపులు కాసేటోళ్లు. తెలంగాణ ప్రభుత్వం వచ్చిన తర్వాత కరెంటు కష్టాలు తీరాయి. విద్యుత్ సబ్‌స్టేషన్లు వచ్చాయి. అవసరం ఉన్న మేరకు ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేస్తున్నారు. పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి చెప్పినట్లు రైతులు 10 హెచ్‌పీ బోర్లు మోటార్లు పెట్టుకోవడం సాధ్యం కాదు. ఆయనవి అవగాహన లేని మాటలు. ఆ మోటర్లతో రైతులకు అన్నిరకాల నష్టమే. కాలువల ద్వారా నీరందని రైతులు బోరుబావుల కింద సాగు చేస్తుంటారు. రైతులకు అవసరానికి అనుగుణంగా 3 నుంచి 5హెచ్‌పీ మోటర్లను బిగించుకుంటారు. ముఖ్యమంత్రి కేసీఆర్ వచ్చిన తర్వాత రైతులకు కరెంటు సమస్యలు తీరాయి. మళ్లీ బీఆర్‌ఎస్ సర్కారు రావాలే.

- నైన ముత్యం, మోటర్ వైండింగ్ రిపేర్, కనకాపూర్

ఎవుసం తెలియనోళ్లు మస్తు చెప్తరు..

నిర్మల్ చైన్‌గేట్, నవంబర్ 23 : నాకు రెండెకరాల వ్యవసాయ భూమి ఉంది. పత్తి, పసుపు పంట సాగు చేస్తున్నాను. తెలంగాణ ప్రభుత్వం వచ్చిన తర్వాత రైతుల బాధలు తీరాయి. కరెంటు కష్టాలు తప్పాయి. రైతులకు మూడుగంటల విద్యుత్ సరిపోతుందని కాంగ్రెస్ నాయకులు అంటున్నారు. వ్యవసాయంపై వారికి అవగాహన లేదు. ఎవుసంపై తెలియని కాంగ్రెసోళ్లు మస్తు మాట్లాడుతున్నారు. మూడు గంటల విద్యుత్ వల్ల ఒక్క మడి తడవదు. 10 హెచ్‌పీ మోటర్లను రైతులు భరించలేరు. విద్యుత్ గ్రిడ్‌పై భారం పడుతుంది. అధిక లోడ్‌తో ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోతాయి. 24 గంటల విద్యుత్ ఇవ్వడం వల్ల ఎవరికీ అనుకూలించిన సమయంలో వాళ్లు వినియోగించుకుంటారు.

- కంచాని ముత్తన్న, పోతారం

అప్పలపాలు అయితం..

తానూర్, నవంబర్ 23 : కాంగ్రెస్ నాయకులు వ్యవసాయానికి ఇచ్చే కరెంటుపై అర్థం పర్థం లేకుండా మాట్లాడుతున్నరు. సాగుకు మూడు గంటల కరెంట్ సరిపోతదనడం వారి అవివేకానికి నిదర్శనం. పొలాల వద్ద 3 హెచ్‌పీ మోటర్లనే అధికంగా వాడుతరు. ఇంకా 5 హెచ్‌పీ వాడుతరు. 10 హెచ్‌పీ మోటర్‌తో రైతుకు ఖర్చు ఎక్కువ. నీరు ఒకేసారి ఎత్తిపోస్తే బోర్లు ఎండిపోవుడు ఖాయం. టెన్ హెచ్‌పీ మోటర్లను బిగించి రైతులందరూ ఒకేసారి బోర్లు ఆన్‌చేస్తే ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోతాయ్. వ్యవసాయానికి 24 గంటల కరెంట్ ఇస్తున్న సీఎం కేసీఆర్‌కి ప్రత్యేక కృతజ్ఞతలు. ఆయనకు ఎప్పుడు రుణపడి ఉంటం. ఆ రుణాన్ని మద్దతు రూపంలో తీర్చుకుంటం.

- తాడేవార్ విఠల్, సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు, తానూర్.

వలస పోయేటోళ్లం..

నర్సాపూర్(జి), నవంబర్ 23 : నాకు రెండెకరాల భూమి ఉంది. గతంల పంటలు పండించడం అంటే మాకు శ్రద్ధ లేదు. ఎందుకంటే మాకు నీళ్లు తక్కువ. దీనికి తోడు కరంట్ ఉండేది కాదు. రాత్రిపూట చేనుకు పోవాలంటే భయం. అడవి జంతువులు దాడి చేసేవి. కేసీఆర్ వచ్చినంక 24 గంటల కరంటు ఇచ్చిండు. ఇప్పుడు భూమి అంతా పండుతున్నది. పొద్దుందాక నీళ్లు కడుతున్నం. పంటల మీద మనసు పెట్టినం. పుట్ల కొద్దీ ధాన్యం వస్తున్నది. కాంగ్రెసోళ్లు 3 గంటల కరంటు ఇస్తమంటున్నరు. అది సాలదు. వాళ్లు కరెంటు ఇవ్వరు. గెలువరు. సావరు. గిట్లయితే భూమిని వదిలి వేరే ప్రాంతానికి వలసపోవాలి. అన్ని రకాలుగా ఆదుకుంటున్న కేసీఆర్ సారుకే మేం అవకాశం ఇస్తాం.

- జాదవ్ మంగిలాల్, అంజనీ తండా, నర్సాపూర్(జి).

కేసీఆర్ సర్కారే కావాలే..

నర్సాపూర్(జి), నవంబర్ 23 : మాకు 5 ఎకరాల భూమి ఉన్నది. తెలంగాణ ప్రభుత్వం ఇస్తున్న 24 గంటల కరెంటుతో రెండు పంటలు పండిస్తున్నం. కూరగాయలు కూడా పండిస్తున్నం. ఆర్థికంగా ఎదుగుతున్నం. కాంగ్రెసోళ్లు మూడు గంటల కరెంటు చాలు అంటున్నారు. అట్లయితే సగం భూమి కూడా పండదు. 10 హెచ్‌పీ మోటర్లు పెడితే ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోతయ్. భూగర్భ జలాలు ఇంకిపోతయ్. అన్నం పెట్టే రైతుకు సున్నం పెట్టాలని కాంగ్రెసోళ్లు సూస్తున్నరు. సున్నం పెట్టే వాళ్లు మాకు వద్దు. అన్నం పెట్టే రైతుకు అన్ని రకాల సాయం అందిస్తున్న కేసీఆర్ ప్రభుత్వమే మాకు కావాలి. మళ్లీ రైతు ప్రభుత్వమే రావాలి. రైతులను మోసగించే వారు మాకు వద్దు. వారికి ఓటు వేయం.

- జాదవ్ మంగల్ అంజనీ తండా.

మూడు గంటలతో ముప్పుతిప్పలే

- కరెంట్ కోసం వేడుకున్నా కనికరించలే
- 'హస్తం'ను నమ్మి కష్టాలు కొనితెచ్చుకోలేం
- సీఎం కేసీఆర్ వల్లే పండుగలా వ్యవసాయం
- 24 గంటల ఉచిత విద్యుత్‌తో రంది లేకుంట పంటలు
- కాంగ్రెస్‌కు ఓటుతో బుద్ధి చెబుతామంటున్న రైతులు

కాంగ్రెస్ పాలనలో ప్రత్యక్ష నరకం చూపిన్రు

కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు కరెంటుకోసం ముప్పుతిప్పలు పడ్డామని, ప్రత్యక్ష నరకం చూపించారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆహర్నిశలు కష్టపడి సాగు చేసిన పంటలు చేతికివచ్చే దశలో ఎండిపోయేవని, కరెంటో రామచంద్రా అని పాలకులను వేడుకున్నా కనికరించలేదని మండిపడుతున్నారు. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తర్వాత ముఖ్యమంత్రి కేసీఆర్ అందిస్తున్న 24 గంటల ఉచిత కరెంటుతో రంది లేకుంటా పంటలు తీస్తున్నామని, దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా రైతు సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నట్లు వారు చెబుతున్నారు. టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి రైతులకు 3 గంటలు కరెంటు సరిపోతుందని, 10 హెచ్‌పీ మోటార్లు వినియోగించుకోవాలని ఉచిత సలహాలు ఇస్తున్నాడంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కాంగ్రెస్ నాయకులు ఎన్నికల సమయంలో రైతులకు మాయమాటలు చెప్పి మభ్యపెట్టే ప్రయత్నాలు చేస్తున్నారని, హస్తం పార్టీ నాయకులను నమ్మే పరిస్థితి లేదని తెలిపారు. ఉమ్మడి రాష్ట్రంలో వ్యవసాయం దండుగ అనే పరిస్థితులు ఉండేవని, ముఖ్యమంత్రి కేసీఆర్ అమలు చేస్తున్న పథకాల ఫలితంగా పదేళ్లలో వ్యవసాయం పండుగలా మారిందని కొనియాడుతున్నారు. తిరిగి కరెంటు కష్టాలను కొని తెచ్చుకునే పరిస్థితుల్లో లేమని, తమ అభివృద్ధికోసం అహర్నిశలు కృషి చేస్తున్న ముఖ్యమంత్రి కేసీఆర్‌నే మరోసారి అధికారంలో నిలబెడుతామని స్పష్టం చేస్తున్నారు. కాంగ్రెస్‌కు ఓటుతో తగిన గుణపాఠం చెబుతామని హెచ్చరిస్తున్నారు.

- నిర్మల్, నవంబర్ 23 (నమస్తే తెలంగాణ)

అర్ధరాత్రి, అపరాత్రి పొలం కాడికి పోయేది..

తానూర్, నవంబర్ 23 : టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి మూడు గంటల కరెంట్‌తోనే పొలం పారుతదంటున్నడు. అది ఎలా సాధ్యం. కాంగ్రెస్ పాలనలో అర్ధరాత్రి భార్యా పిల్లలను వదిలి పొలాల వద్ద ఉంటూ కరెంటు కోసం ఎదురు చూసేది. విద్యుత్ వస్తే బోర్లు ఎప్పుడేయాలా అని చూసేటోళ్లం. కేసీఆర్ సీఎం అయ్యాక కరెంటు బాధలు తప్పాయి. బీఆర్‌ఎస్ సర్కారు హయాంలో 24 గంటలు ఉంటనే ఉంటంది. నాకు తెలిసినంత వరకు పొలం ఎండిపోయిన రోజు లేదు.

- సిరిమొల్ల లక్ష్మణ్, ఎంపీటీసీ, మొగిలి.

ఆనాటి బాధలు కండ్ల ముందు కదలాడున్నయ్..

దిలావర్‌పూర్, నవంబర్ 23: కాంగ్రెస్ పార్టీ పాలనలో కరెంటు కోసం పడిన బాధ లు అన్నీఇన్నీ కావు. ఏనాడు కంటి నిండా నిద్ర లేదు. కరెంట్ కోసం భార్యా పిల్లలను వదిలి రాత్రంత చేల వద్దనే జాగారం చేసేటోళ్లం. చీకట్లో పొలాల వద్ద పాములు, తేళ్లు కరిచేవి. కరెంట్ షాక్‌తో కూడా అనేక మంది చనిపోయారు. ఆ బాధలు మాకు మళ్లీ రావద్దు. ఆ కాంగ్రెస్ పార్టీకి ఓటు మా రైతుల కుటుంబాలకు చేటు అవుతది. మళ్లీ గిసొంటి కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసి బాధలు కోని తెచ్చుకోలేం. సీఎం కేసీఆర్ ఇస్తున్న 24 గంటల కరెంట్‌తో ఎవుసం బాగుంది. కాంగ్రెస్ అధికారంలోకి వస్తదా.. చస్తదా..

- శ్రీనివాస్‌రెడ్డి, రైతు, దిలావర్‌పూర్.

కరెంట్ బాధలు తీరినయ్..

తానూర్, నవంబర్ 23 : కరెంట్ కోతలతో రాత్రుళ్లు జాగారం చేసినాం, ఇప్పుడు ఆలాంటి ఇబ్బంది లేకుండా 24 గంటల కరెంట్ ఇస్తున్నారు. కేసీఆర్ వచ్చిన తర్వాత రైతులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ఎవుసం చేసుకుంటు న్నారు. తెలంగాణ రాకముందు రాత్రి కరెంట్‌తో పొలాల్లోనే పండుకునేటోళ్లం. పొలాలకు పోవాలంటే భయమయ్యేది. రాత్రిపూట కరెంట్ కష్టాలు కేసీఆర్ సారు వచ్చినాక తీరినయ్. 24 గంటల కరెంట్ ఇవ్వడం వల్ల ఇబ్బంది లేకుండా పంటలు పండించుకుంటున్నం. 10 హెచ్‌పీ మోటర్లు కొనలేం. అంతభారం మోయలేం. కరెంట్ 24 గంటలు ఉండాలి. సీఎంగా కేసీఆర్ సార్ ఉంటేనే అది సాధ్యమైతది.

- తాడేవార్ రామ్, రైతు, తానూర్

ఒక్క పంట కూడా పండించలేం..

ముధోల్, నవంబర్ 23 : తెలంగాణ వచ్చినంక కరెంటు కష్టాలు తప్పినయ్. సాగుకు 24 గంటలు ఉచిత కరెంటు అందుతున్నది. సీఎం కేసీఆర్ రైతుబంధు, రుణమాఫీ చేస్తున్నడు. దురదృష్టవశాత్తు రైతు మరణిస్తే రూ.5 లక్షల బీమా వస్తున్నది. కాంగ్రెస్ సాగుకు మూడు గంటల కరెంటు చాలు అంటున్నది. రెండు పంటలు కాదు కదా.. ఒక్క పంట పండించ డం కూడా గగనమే అవుతది. మన బతుకు లు బాగు చేసేటోళ్లకే అండగా ఉంటం.

- సాయిలు, రైతు, ముధోల్.

చేతులు తడపందే ఫైలు కదిలేది కాదు..

ఖానాపూర్ రూరల్, నవంబర్ 23 : కాంగ్రెస్ పాలనలో అధికారులకు చేతులు తడపనిదే డాక్యుమెంట్లు ముందుకు కదిలేవి కావు. పట్టాలు లేక గ్రామంలో నిత్యం భూతగదాలు అయ్యేవి. ఏం వెలుగబెట్టారని ఓట్లు అడగడానికి వస్తున్నరు. పంట అమ్మేటప్పుడు ఇబ్బంది పెట్టిన్రు. ఎరువులు కొనేటప్పుడు క్యూలో నిలబెట్టిన్రు. కేసీఆర్ సర్కారు అన్ని బాధలు తీర్చింది. ఇగ, ధరణిని తీసుకొచ్చి భూములకు రక్షణ కల్పించింది. నయా పైసా ఖర్చు లేకుండా పట్టాలు అవుతున్నాయ్.

- చింతల మల్లేశ్, రైతు, దిలావర్‌పూర్.

దళారీ వ్యవస్థ మళ్లా తీసుకురావద్దు

ఖానాపూర్, నవంబర్ 23 : రైతులకు పారదర్శకంగా సేవలందిస్తున్న ధరణి పోర్టల్‌ను రద్దు చేసి, మళ్లా దళారి వ్యవస్థను తీసుకురావద్దు. ధరణి పోర్టల్ తీసేస్తే రెవెన్యూశాఖలో పాతకాలం నాటి పటేల్, పాట్వారీ వ్యవస్థకు పునర్జీవం పోసినట్లుంటది. ధరణి పోర్టల్ వచ్చినప్పటి నుంచి రైతులు భూ కొనుగోళ్లు, విక్రయాలు సులభతరంగా మరినయ్. ముందుగా మీ సేవలో స్లాట్ బుక్ చేసుకుంటే కేవలం గంటల వ్యవధిలోనే నేరుగా మన పేరు మీద పట్టా అవుతుంది. గతంలో భూమి పట్టా చేసుకోవాలంటే గ్రామంలోని మధ్య వ్యక్తికి ముడుపులు ఇచ్చి తహసీల్దార్ కార్యాలయం చుట్టూ నెలల తరబడి తిరగాల్సి వచ్చేది. అప్పుడు అధికారులు దయతలిస్తే గానీ పట్టా అయ్యేది కాదు. మనకు తెలువకుండానే మన భూములను ఇతరులకు పట్టా చేసే వారు. కానీ సీఎం కేసీఆర్ సారు తీసుకువచ్చిన ధరణితో మన వేలిముద్ర లేకుండా ఇతరుల పేరు మీదకు పట్టా కాదు. మళ్లా పాత వ్యవస్థ వస్తే రైతుల బతుకులు ఆగమైతయ్. ధరణి పోర్టల్‌ను కొనసాగించి, పాత విధానం రాకుండా చెయ్యాలె.

- గొర్రె గంగాధర్, ఖానాపూర్

ధరణే ఉండాలే..

లోకేశ్వరం, నవంబర్ 23 : తెలంగాణ ప్రభుత్వం తీసుకొచ్చిన ధరణితో రైతులకు మేలే జరుగుతుంది. ఇప్పుడు పైరవీలు లేవు. దళారీ వ్యవస్థ లేదు. గతంలో మాదిరిగా అధికారులు, కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేదు. అరగంటలో రిజిస్ట్రేషన్ పూర్తయి పత్రాలు చేతికందుతున్నాయి. రైతుల భూములపై ఇంకొకరికి హక్కుండదు. సంబంధిత యజమాని వేలిముద్ర వేస్తే భూమి బదలాయింపు జరిగింది. ధరణే ఉండాలే. గతంలో మాదిరిగా అవకతవకలకు తావు లేదు. కాంగ్రెస్ నేతలు ధరణిని రద్దు చేస్తామని ప్రగల్భాలు పలుకుతున్నారు. అలా చేస్తే పాతకాలం పరిస్థితి వస్తుంది. దీంతో పాటు పైరవీ కారులు పెరుగుతారు. రైతులకు తెలియకుండానే గోల్‌మాల్ జరిగే ఆస్కారం ఉంది. వారి వ్యవహారం చూస్తే రైతులను పక్కతోవ పట్టించేలా ఉంది. అలాగే మళ్లీ పట్వారీ వ్యవస్థ వస్తే రైతులకు గోస తప్పదు. అందుకే కాంగ్రెస్‌కు ప్రజలు ఓటు వేయరు. బీఆర్‌ఎస్ వెంటే ఉంటారు. ఆదరిస్తారు.

- మగ్గిడి భోజారెడ్డి, (ధర్మోరా)

పట్టాలు తారుమారు అవుతాయ్..

లక్ష్మణచాంద, నవంబర్ 23 : కాంగ్రెస్ కాలంలో రైతులు రందితో ఆత్మహత్యలు చేసుకుంటే, చలించిన ముఖ్యమంత్రి కేసీఆర్ తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం తర్వాత ధరణి పోర్టల్‌ను తీసుకొచ్చి రైతులకు మేలు చేసిండు. భూములకు భద్రత కల్పించిండు. గుండెల మీద చేయి వేసుకొని పడుకునేలా చేసిండు. ధరణితోనే రైతుబీమా, రైతుబంధు ఎవరికీ డబ్బులు ఇవ్వాకున్నా మా ఖాతాలో పడుతున్నాయి. కాంగ్రెస్ కాలంలో భూముల పట్టాల కోసం కాళ్లరిగేలా తిరిగేటోళ్లం. ధరణి వచ్చినంకా గంటలో పట్టా చేతికి అందుతున్నది. మళ్లీ వీఆర్‌వోలు వస్తే పట్టాలు తారుమారు అవుతాయి. రైతులు లంచాలు ఇవ్వలేక, తిరగలేక అవస్థలు పడే రోజులొస్తాయి. రైతులను అవస్థలు పెట్టే కాంగ్రెస్ పార్టీకి మద్దతివ్వం.

- రాందేని ముత్యం, రాచాపూర్, లక్ష్మణచాంద మండలం.

రైతులమంతా కేసీఆర్‌కు అండగా ఉంటాం..

లోకేశ్వరం, నవంబర్ 23 : ధరణి పోర్టల్ లేకుంటే రైతులు ఆగమవుతారు. ధరణి లేక ముందు రైతులకు పట్టా పాసు పుస్తకాలు ఉండేవి కావు. భూమిపై హక్కులు కలిగి ఉండేవారు కాదు. రుణాల కోసం అవస్థలు పడేవారు. పటేల్ పట్వారీలు రాసిందే పరిగణలోకి తీసుకునే వారు. పటేల్ పట్వారీలు ఒకరి భూములను మరొకరి పేరు మీద రాసి పెడుదురు. దీని వల్ల తరచూ గొడవలు జరిగేది. రైతులు అధికారుల చుట్టూ తిరగాల్సి వచ్చేది. ధరణి రావడంతో ఈ సమస్యలన్నీ పోయాయి. రైతులకు అన్ని రకాల భూములు ధరణిలో ఎక్కాయి. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ధరణి పోర్టల్‌ను తీసేస్తామంటున్నారు. దీని వల్ల రైతులకు ఇబ్బందులు తప్పవు. ధరణి పోర్టల్‌ను తీసుకొచ్చినందుకు సీఎం కేసీఆర్‌కు ధన్యవాదాలు. రైతులమంతా బీఆర్‌ఎస్ వెంటే ఉంటాం. కాంగ్రెస్‌కు వాత పెడుతాం. ధరణి ఉండేందుకు సీఎం సార్ వెంట నడుస్తాం.

- జే రాజు పటేల్, రాయపూర్ కాండ్లి(లోకేశ్వరం)

'ధరణి' ఎత్తేస్తే.. పైరవీకారులదే రాజ్యం

- పైసలు ముట్టజెప్పనిదే ఫైలు ముందుకు కదలదు..
- పటేల్, పట్వారీ వ్యవస్థలు మళ్లీ పుట్టుకొస్తయ్..
- పట్టా కావాలంటే డబ్బులు ముట్టజెప్పాల్సిందే..
- మళ్లీ పాత పద్ధతిని తీసుకొచ్చేందుకు కాంగ్రెస్ కుట్ర



నిర్మల్, నవంబర్ 23(నమస్తే తెలంగాణ) : ధరణిని బంగాళాఖాతంలో వేస్తామంటున్న కాంగ్రెస్ తీరుపై కర్షకలోకం భగ్గుమంటున్నది. మళ్లీ పటేల్, పట్వారీ వ్యవస్థ వస్తే రెవెన్యూ కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు తప్పవంటున్నారు. పాత పద్ధతిని తీసుకొచ్చి దళారీ వ్యవస్థను ప్రోత్సహించేలా కాంగ్రెస్ కుట్రలు చేస్తున్నదని రైతులు మండిపడుతున్నారు. పట్టా పాస్‌బుక్‌లో కౌలుదారుని పేరును చేర్చి, రైతుతో సమానంగా వారికి కూడా హక్కులు కల్పిస్తామని కాంగ్రెస్ నాయకులు చేసిన వ్యాఖ్యలపై భయాందోళనకు గురవుతున్నారు. గతంలో తప్పుడు రికార్డుల కారణంగా అసలైన రైతులకు ప్రభుత్వ పథకాలు అందేవి కావు. దీంతో అనేక మంది రైతులు అప్పులపాలై ఆత్మహత్యలకు పాల్పడ్డ సంఘటనలు కాంగ్రెస్ పాలనలో చూశామని గుర్తు చేసుకుంటున్నారు. ఇలాంటి సమస్యలన్నింటికీ శాశ్వత పరిష్కారం చూపేందుకు సీఎం కేసీఆర్ ధరణిని తేవడంతో రైతుల జీవితాలు బాగుపడ్డాయి.ధరణి ఆధారంగానే రైతుబంధు, రైతుబీమా పథకాలు అన్నదాత ఇంటికి చేరుతున్నాయి. ఎలాంటి దళారీ వ్యవస్థ లేకుండా నేరుగా రైతన్న ఇంటికే అందేలా.. ధరణి పోర్టల్ రైతులకు ఉపయోగపడుతున్నది. అలాగే భూముల క్రయ, విక్రయాల ప్రక్రియ నిమిషాల వ్యవధిలో పూర్తవడం వంటివి ధరణి కారణంగానే జరుగుతున్నాయి. ఇలా అన్ని విధాలుగా రైతులకు అండగా ఉన్న ధరణిపై కాంగ్రెస్ నాయకులు కుట్రలకు తెరలేపడంపై రైతులు ఆగ్రహం వ్యక్త చేస్తున్నారు. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి బుద్ధి చెప్పి రైతుల మధ్య చిచ్చు పెట్టే యత్నాలను తిప్పి కొడతామని ముక్తకంఠంతో నినదిస్తున్నారు.

మళ్లీ పాత రోజులే..

సారంగాపూర్, నవంబర్ 23 : ధరణి పోర్టల్‌తో రెవెన్యూ రికార్డులు భద్రంగా ఉన్నాయి. గతంలో పటేల్, పట్వారీ వ్యవస్థ ఉన్నప్పుడు ఎవరి భూములు ఎవరికీ రాశారో తెలియదు. ఒక ఎకరం పట్టా భూమి పేరు కాస్తులో ఒకరు, పట్టాలో ఒకరు ఉండడంతో ఆ ఇద్దరి మధ్య గొడవలు జరిగేవి. ధరణి వచ్చాక అటువంటి సమస్యలేవి లేవు. ఒక వ్యక్తికి ఒకే పాస్ పుస్తకం ఇచ్చారు. కాంగ్రెస్ పార్టీ వారికి చాన్స్ ఇస్తే మళ్లీ పాత రోజులే వస్తాయి. గ్రామాల్లో గొడవలు పెరుగుతాయి.

- బోడకుంటి రాజేశ్వర్, రైతు, జౌళి

అప్పటి గోస తలుసుకుంటనే బాధైతది..

కడెం, నవంబర్ 23 : ధరణిని తీసేస్తే మళ్లీ తిప్పలే. కాంగ్రెస్ హయాంలో ఎంత గోస పడ్డాం. తిరిగి అదేగోస పడడానికి ఓటేయాల్నా. వాళ్లప్పుడు భూముల విషయంలో ఎన్ని గొడవలు జరిగినయో జగమెరిగిన సత్యం. ధరణితో భూ క్రయవిక్రయాలు ఒక్కరోజులో పూర్తవుతున్నయ్. కాంగ్రెస్ హయాంలో ఆఫీసుల చుట్టూ యేడాదికిపైగా తిరగంగా తిరగంగా , లంచాలు ఇస్తే పనయ్యేది. మంచి నుంచి మళ్లీ చెడులోకి ఎందుకు పోతం.

- రాజేశ్వర్‌గౌడ్, రైతు, ధర్మాజిపేట, కడెం.